
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 20 జనవరి 2025 | 5





6

విద్యుత్ షాక్ కొడితే.. చేయి పోయింది!

లిఫ్ట్ ఇచ్చి..బంగారు గొలుసు లాగేశాడు

## నేడు రాజానగరంలో పీజీఆర్‌ఎస్‌కు కలెక్టర్



రాజానగరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలస్థాయిలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతారని తహశీల్దార్ జి.అనంత లక్ష్మి సత్యవతి దేవి ఆదివారం తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే రాజానగరం మండల స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఈ సోమవారం కలెక్టర్ విచ్చేస్తున్నారన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండల ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు.మండల పరిధిలో భూసమస్యలు ఎక్కువ కావడంతో ఆయా సమస్యలపై ఎక్కువగా అర్జీదారులు వచ్చే అవకాశం ఉంది.ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల స్థాయిలో అధికారులంతా సమావే శానికి హాజర య్యేలా చర్యలు చేపట్టారు. ఎందుకంటే గతంలో నల్లజర్లలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పాల్గొనగా కొంత మంది అధికారులు గైర్హాజర య్యారు.దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం.

### కలెక్టరేట్‌లో యధావిధిగా..

రాజమహేంద్రవరం సిటీ:కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ యథా విధిగా సాగుతుందని కలెక్టర్ ప్రశాంతి పేర్కొ న్నారు.జిల్లాలో ప్రజలు కలెక్టరేట్‌కు వెళ్లి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

6

## చదవలేక.. చచ్చిపోతున్నా!

ఎంతో మందికి ఊపిరిపోయాల్సిన చదువు అతని ఊపిరినే తీసింది.. మూడేళ్లు కష్టపడి ఎంబీబీఎస్ చదివాడు.. ఈ ఏడాదితో చదువు పూర్తయిపోతోంది.. ఈ ఏడాది మా అబ్బాయి ఎంబీబీఎస్ పూర్తయిపోతుందని కుటుంబీకులు తెలిసినవారందరికీ చెప్పుకుంటున్నారు.. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయలేదు..అలాగని ఎంబీబీఎస్ పూర్తి చేయలేదు.. ఎందుకంటే అతనికి బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి.. చివరి ఏడాది కావడంతో చదువు పూర్తయిపోవాల్సిందే.. లేకపోతే ఇటు ఇంట్లో..అటు బంధువుల్లోనూ తలెత్తుకోలేడు..ఆ ఒత్తిడిలో ఎంతో మదన పడ్డాడు.. బయటపడలేకపోయాడు.. గత 8 నెలలుగా ఒక్కటే ఆలోచన.. ఆత్మహత్య చేసుకోవాలని.. కానీ మనసుకు అదుపు చేసుకుంటూ వచ్చాడు.. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు.. సంక్రాంతి సెలవులకు ఇంటికి రాలేదు.. పరీక్షలు ఉన్నాయని చెప్పాడు.. పండుగకు అందరూ వెళ్లిపోవడంతో హాస్టల్‌లో ఒక్కడే ఉన్నాడు.. ఆ ఆలోచన మరింత పెరిగింది.. డాడీ.. అమ్మా..తమ్ముడు నన్ను క్షమించండి అంటూ శనివారం ఒక లెటర్ రాసి.. ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. ఈ విషాద ఘటన విజయనగరం జిల్లా నెల్లిమర్ల మిమ్స్ మెడికల్ కాలేజీలో జరగ్గా..తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో విషాదఛాయలు అలుముకున్నాయి.







**అయ్యో పాపం :** ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇటీవల కాకినాడ సముద్ర తీరాన మృత్యువాత పడిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు

# నో..లివ్!

## తీరాన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత్యుఘోష

- గుడ్లు పెట్టేందుకు వచ్చి మృతి
- తీరం పొడవునా కళేబరాలు
- కాలుష్యమే కారణంగా అంచనా
- ఒక్కో తాబేలు 120 గుడ్లు
- అయినా అంతరించే ప్రమాదం
- డిప్యూటీ సీఎం పవన్ దృష్టి
- హోప్‌ఐలాండ్‌లో వేట నిషేధం
- కాపాడేందుకు చర్యలు

సర్పవరం జంక్షన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాగరతీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. వేల కిలోమీటర్ల నుంచి రాష్ట్ర తీరప్రాంతానికి గుడ్లు పెట్టేందుకు వస్తున్న తాబేళ్లు సముద్రతీరంలో ఎక్కడ చూసినా చనిపోయిన దర్శనమిస్తున్నాయి. సముద్రంలో అరుదుగా లభించే జాతిగా పేరొందిన ఈ తాబేళ్లు విదేశాల నుంచి వేలాది కిలో మీటర్లు ఈదుకుంటూ వచ్చి తీరప్రాంతంలో గుడ్లు పెడతాయి. అలా వచ్చిన తాబేళ్లు చనిపోతుండడం కలవరానికి గురిచేస్తోంది. తీరప్రాంతాలకు ఆనుకుని ఉన్న పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన కాలుష్యం,వేటగాళ్ల వలలకు చిక్కుకోవడం, ఇంజన్ పంకాకు తాబేళ్లు తగిలి మృత్యువాత పడుతున్నట్టు అంచనా. దీనిపై ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాబేళ్లను సంరక్షించాలని..మృతికి గల కారణాలు అధ్యయనం చేయాలని.. సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు అటవీ అధికారులు కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతంలో తాబేళ్ల సంరక్షణలో భాగంగా మార్చి వరకు చేపల వేట నిషేధించారు.

### గుడ్లు పెట్టేందుకే రాక..

రాష్ట్రంలో 974 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు థాయిలాండ్, మలేషియా, ఇండోనేషియా తదితర తీర ప్రాంత దేశాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి కాకినాడ, కోనసీమ, బాపట్ల, నెల్లూరు తీర ప్రాంతాలకు డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుడ్లు పెట్టేందుకు వస్తాయి. ఇవి రాత్రి సమయంలో తీరంలోని సముద్ర ఇసుకలోకి వచ్చి గోతులు తయారు చేసుకుని, వాటిలో ఒక్కో ఆడ తాబేలు 60 నుంచి 120 వరకు గుడ్లు పెడుతుంటాయి. గుడ్డు నుంచి పిల్లలగా మారేందుకు 50 రోజుల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుడ్లు పెట్టేందుకు ఒక్కో గొయ్యి కోసం ఇవి సుమారు గంట వరకు సమయం తీసుకుంటాయి. జనసంచారం, జంతువుల సంచారం లేని రాత్రి సమయంలో ఇవి ఒడ్డుకు వచ్చి గుడ్లు పెడతాయి. అయితే జిల్లాలో అద్దరిపేట సముద్ర తీరం నుంచి కాకినాడ తీరం వరకు 35 కిలోమీటర్ల మేర ఎక్కడ చూసినా మృతి చెందిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు దర్శనమిస్తున్నాయి. ఉప్పాడ, కాకినాడ రూరల్ నేమాం, సూర్యారావుపేట, వాకలపూడి, కుంభాభిషేకం బీచ్‌లో తాబేళ్ల కళేబరాలు దర్శనమిస్తోండడం ఆందోళన కలిగిస్తోంది. సముద్ర తీరం ఆనుకుని ఉన్న పలు పరిశ్రమలు విడుదల చేసే కాలుష్య కారకాలతో ఇవి మృతి చెందుతున్నాయి. మత్స్యకారులు ఇంజన్ బోట్లతో చేపల వేటకు వెళ్లే సమయంలో వలలో చిక్కుకోవడం, ఇంజన్ బోటు పంకాల్లో పడి ఇవి మృత్యువాత పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

### జెల్లీ చేపలే ఆహారం..

సముద్ర పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు కీలకపాత్ర పోషిస్తాయి. సముద్రంలో ఆక్సిజన్, చేపల సంతానం వృద్ధికి తాబేళ్లు దోహదం చేస్తాయి.సముద్రంలో ఉండే చేపపిల్లలను ఆహారంగా తీసుకుని జీవించే జెల్లీ చేపలను తాబేళ్లు ఆహారంగా తీసుకుంటాయి.దీంతో మత్స్య సంపద అంతరించకుండా వృద్ధి అయ్యేలా పరోక్షంగా కీలకపాత్ర పోషిస్తాయి. తాబేలు లోతులో ఉన్నా ప్రతి 45 నిమిషాలకు ఒకసారి సముద్రం పైకి వచ్చి ఆక్సిజన్ విడుదల చేస్తుంది. అలా సముద్రం పైకి, లోపలికి వచ్చి, వెళ్లడం ద్వారా నీటిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. సముద్ర పర్యావరణాన్ని కాపాడేందుకు తాబేళ్లు మేలు చేస్తాయి.

### అరుదైన జాతి..అయినా!



ఆలివ్ రిడ్లీ తాబేళ్లు అంతరించుకుపోతున్న అరుదైన తాబేళ్ల జాతిగా ప్రపంచ పర్యావరణ నిపుణులు ప్రకటించారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్లు 7 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో ఐదు రకాలు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నాయి. రెండు అడుగుల వెడల్పుతో ఉండే ఈ తాబేలు 50 కిలోల బరువు ఉంటుంది. ఇవి 20 వేల కిలోమీటర్లు దూరం ప్రయాణించి తీరానికి వస్తున్నాయి.గుడ్డు నుంచి పిల్లగా ఎదిగిన ఈ తాబేళ్లు ఎక్కడికి వెళ్లినా తిరిగి ఇక్కడికే వచ్చి గుడ్లు పెట్టడం వీటి ప్రత్యేకత. దేశంలో ఒడిశా తర్వాత ఈ తాబేళ్లు రాష్ట్రంలోకి అధికంగా రావడం, గుడ్లు పెట్టడం వెళ్లిపోవడం జరుగుతుంటుంది. బాపట్ల సూర్యలంక, గుంటూరు జిల్లా నిజాంపట్నం,నాగాయలంక జింకపాలెం, కృష్ణా జిల్లా కోడూరు, కాకినాడ తీరంలో ఉప్పాడ, కాకినాడ, హోప్‌ఐలాండ్, కోరంగి అభయారణ్యం తదితర సముద్రతీర ప్రాంతాలకు ఆలివ్ రిడ్లీ తాబేళ్లు ఎక్కువగా వస్తుంటాయి.




# ఆరోగ్యం.. బాగాలేదు!

## 27 శాతం మందికి బీపీ.. 20 శాతం మందికి షుగర్

*తూర్పుగోదావరి జిల్లాలో బీపీ ఉన్నవారు ఎంత మందో తెలుసా 27 శాతం.. షుగర్ ఉన్నవారెంత మందో తెలుసా 20 శాతం.. ఈ లెక్క ఎలా తెలిసిందంటారా.. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే చేస్తున్నారు.. ప్రతి రోజూ పది గృహాలకు వెళ్లి సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.. అనుమానం వస్తే చాలు పరీక్షలు చేస్తున్నారు.. ఈ విధంగా పెద్ద ఎత్తున క్యాన్సర్ పేషెంట్లు బయటపడుతున్నారు.. జిల్లాలో మొత్తం 18,13,818 మంది ఉంటే ఇప్పటి వరకూ 2,70,106 మంది ఆరోగ్యంపై ఆరా తీయగా చాలా మందిని రోగాలు వెంటాడుతున్నట్టు తేలింది. ఈ సర్వే జూలై వరకూ సాగనుంది.*

- పెరుగుతున్న క్యాన్సర్ పేషెంట్లు
- జిల్లావ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే
- 2.7 లక్షల మంది నుంచి ఆరా
- మిగిలింది 12.5 లక్షలు
- ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు
- అనుమానితులకు క్యాన్సర్ టెస్ట్
- రోగి వివరాలన్నీ ఆన్‌లైన్
- ఎక్కడైనా వైద్యానికి అవకాశం




(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జిల్లా ప్రజానీకం ఎలా ఉన్నారు.. అంతా ఆరోగ్యంగా ఉన్నారా..?ఏ రకమైన అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నారా..? అసంక్రమిత వ్యాధుల (ఎన్‌డీసీ) సర్వే జిల్లా వ్యాప్తంగా ప్రజానీకం రోగాల లెక్క తేలుస్తుంది.18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులందరికీ ప్రభుత్వం ఉచితంగా పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తోంది. అందరికీ బ్రస్ట్, నోరు, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారు.ఈ సర్వే 8 నెలల పాటు జరుగుతోంది.

### 2,70,160 మందికి పరీక్షలు

జిల్లాలో మొత్తం 6,48,311 నివాసితులు ఉన్నారు. 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు 18,13,818 మంది ఉన్నారు.వీరిలో ఇంత వరకూ 1,00,839 నివాసితులకు సంబంధించిన 2,70,106 మందికి పరీక్షలు చేశారు.37 మందికి నోటిక్యాన్సర్ నిర్ధారణ అయ్యింది..657 మందిని అనుమానితులుగా గుర్తించారు. 102 మందికి బ్రస్ట్ క్యాన్సర్ నిర్ధారణ కాగా 781 మందిని అనుమానితులుగా గుర్తించారు. 70 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కాగా 645 మందిని అనుమానితులుగా గుర్తించారు. ఇక 37,222 మందికి హైపర్ టెన్షన్(బీపీ) ఉన్నట్టుగా నిర్ధారించగా 20,105 మందిని అనుమానితులుగా, 30,113 మందికి షుగర్ ఉన్నట్టు నిర్ధారించగా మరో 27,950 మందిని అనుమానితులుగా గుర్తించారు. జిల్లాలో 27 శాతం మందికి బీపీ, 20 శాతం మందికి షుగర్ ఉన్నట్టు అంచనా వేశారు.జిల్లాలో ఇంకా 5 లక్షలకు పైగా కుటుంబాల్లోని సుమారు 12.5 లక్షల మందికి పరీక్షలు చేయవలసి ఉంది. ఆరోగ్య సర్వే త్వరగా చేయించడం వల్ల బాధితులెవరో తేలుతుంది. త్వరిత గతిన వైద్యం అందుతోంది.

### వివరాలన్నీ ఆన్‌లైన్..

ఎన్‌సీడీ-3.0 పేరిట సర్వే జరుగుతోంది.ప్రతి రోజూ జిల్లాలో కనీసం పది గృహాలకు వెళ్లి ఏఎన్ఎం, ఆశా వర్కరు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వమే ఇంటింటికీ ఒక బృందాన్ని పంపి పరీక్షలు చేయిస్తోంది.రొమ్ము క్యాన్సర్‌ను మహిళలే స్వయంగా గుర్తించేటట్టు అవగాహన కల్పిస్తున్నారు.నోటి క్యాన్సర్ ఎందుకు వస్తుందనే అంశంపై సర్వే చేస్తున్నారు.ఆయా వ్యక్తుల ఆహార అలవాట్లు, పొగ తాగడం, గుట్కాలు నమలడం వంటి వాటివల్ల ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. రోగి పేరు, వ్యాధి, వాడుతున్న మందులు, గతంలో వారి వైద్య చరిత్ర అన్నీ ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆ రోగి వేరే ప్రాంతానికి వెళ్లి ప్రభుత్వా సుపత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చు. దానికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డును చూపిస్తే, దాని నెంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాలన్నీ సదరు డాక్టరు తెలుసుకుని సంబంధిత వైద్యం కొన సాగించే అవకాశం ఉంది. జిల్లాలో జూలై వరకూ సర్వే జరుగుతోంది. అన్ని గ్రామాలకు ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు ఉన్నారు.అటు వంటప్పుడు కేవలం రోజుకు 10 కుటుంబాలకే పరిమితం ఎందుకు,ప్రతి మండలం యూనిట్‌గానో, గ్రామం యూనిట్‌గానో సర్వే చేస్తే సమస్యలు త్వరగా బయటకు వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.



### అమ్మా..కోట సత్తెమ్మ

నిడదవోలు,జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు.ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహ స్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు.ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆదివారం ఒక్కరోజే రూ.2,00,565/-లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్, చైర్మన్ రవి శంకర్ తెలిపారు.

## ప్రశాంతంగా రేషన్ డీలర్ల రాతపరీక్ష





రాజానగరం గైట్, కొవ్వూరు ఏబీఎన్ కళాశాలల్లో రేషన్ డీలర్ల రాత పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు, ఆర్‌డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత

- గైట్ కళాశాలలో రాజమండ్రి డివిజన్ పరీక్ష
- 145 షాపులకు నోటిఫికేషన్
- 450 మంది హాజరు
- ఏబీఎన్ కళాశాలలో కొవ్వూరు డివిజన్ పరీక్ష
- 64 షాపులకు నోటిఫికేషన్
- 124 మంది హాజరు
- 31న తుది ఫలితాలు వెల్లడి

రాజానగరం/కొవ్వూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నిర్వహిస్తున్న రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. రాజమహేంద్రవరం డివిజన్‌కు సంబంధించి గైట్ ఇంజనీరింగ్ కళాశాల, కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి ఏబీఎన్ & పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం డీలర్ల ఎంపికకు 80 మార్కులకు రాత పరీక్షలు నిర్వహించారు. ఫెయిర్ ప్రైస్ షాప్(ఎఫ్.పి షాప్స్) పేరిట పరీక్షలు నిర్వహించినట్టు ఆర్‌డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత తెలిపారు. గైట్ పరీక్షా కేంద్రాన్ని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్, రాజానగరం తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి ఆకస్మికంగా సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, రంగంపేట, అనపర్తి, బిక్కవోలు, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, కడియం, పది మండలాలకు సంబంధించి 145 దుకాణాలకు 487 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరిలో 450 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు చెప్పారు. కొవ్వూరు ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్ పరిధిలో 9 మండలాల్లో ఖాళీగా ఉన్న 73 రేషన్‌డీలర్లకు గాను 64 షాపుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా 185 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిలో విద్యార్హతలు లోపించడం, నోటిఫికేషన్‌లో పొందుపర్చిన రోస్టర్‌లో దరఖాస్తు చేయక పోవడం, వయో పరిమితి 40 ఏళ్లు దాటిన అభ్యర్థులకు సంబంధించి 53 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందన్నారు. ఆదివారం 132 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ నెల 21వ తేదీన పరీక్షా పత్రాల మూల్యాంకనం చేస్తామన్నారు. 28వ తేదీన 20 మార్కులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 31వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామన్నారు.ఆమె వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వై.రమేష్, సీఎస్ డీటీలు ఎం.సునీత, ఎ.సత్యనారాయణ, ఎం.అనిల్, టి.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు

## సినీ పరిశ్రమకు ఆంధ్ర అనుకూలం

### కార్మిక శాఖ మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సినీ కార్మికులకు న్యాయం చేయడానికి తగిన కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ సినీ వర్కర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరై మాట్లాడారు. సినీ పరిశ్రమకు ఎంతో అనువైన ఆంధ్రప్రదేశ్‌ను టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి మంత్రి కందుల దుర్గేష్ కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో షూటింగ్‌లు చేయడానికి నిర్మాతలు రావాలన్నారు.అవసరమైతే ప్రభుత్వ పరంగా సాయం అందజేస్తామన్నారు.ఇక్కడ షూటింగ్‌లు చేస్తే స్థానికులకు 80 శాతం అవకాశాలు ఇవ్వాలనే నిబంధన అమలవుతుందని,తద్వారా ఈ ప్రాంత కళాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ సినీ పరిశ్రమకు ఆంధ్ర అనువుగా ఉంటుందన్నారు.దర్శక నిర్మాతలు ఆంధ్ర వైపు చూడాలన్నారు.రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సినీ కళాకారుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. సీఎం చంద్రబాబుకు సినీ పరిశ్రమ అంటే ఎంతో అభిమానమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీ పరిశ్రమకు చెందిన వారేనని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ నిలదొక్కుకొనే చర్యలు చేపట్టాలని కష్టపడి పనిచేస్తున్న స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలని పలువురు ప్రముఖులు కోరారు. ఈ కార్యక్రమంలో సినీ హీరో భానుచందర్, నటుడు పిల్లా లక్ష్మీ ప్రసాద్, సోము వీర్రాజు, ఆకుల వీర్రాజు, శ్రీనివాసనాయుడు, పంతం కొండలరావు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేశవరావు,మేడా శ్రీనివాస్, నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు పాల్గొన్నారు.

# చిత్రం.. భళారే విచిత్రం

● అమలాపురంలో వైభవంగా ప్రారంభమైన అంతర్జాతీయ చిత్రకళా బ్రహ్మోత్సవం
● పాల్గొన్న ప్రముఖులు
● అవర్ ఆర్టిస్ట్స్ బోర్క్ టూ ఎక్సెల్ పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సత్యసాయి కల్యాణ మండపంలో కోనసీమ చిత్రకళాపరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి కొరసాల సీతారామస్వామి ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన వైభవంగా జరిగింది. అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి ప్రదర్శనను ప్రారంభించారు. చిత్రకళా బ్రహ్మోత్సవం వేడుకలను చేనేత కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ వావిలాల సరళాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, రంకిరెడ్డి కాశి, సూదా గణపతి వంటెద్దు వెంకన్నాయుడు, కౌన్సిలర్ మట్టపర్తినాగేంద్ర పాల్గొన్నారు. బాపు చిత్రకళా ప్రదర్శనను గంధం కె.దుర్గాప్రసాద్, వడ్డాది పాపయ్య చిత్రకళా ప్రదర్శనను సుంకర చలపతిరావు, నీలి వెంకటరమణ చిత్రకళా ప్రదర్శనను అబ్దుల్ రజాహుస్సేన్, వీకేఆర్ శర్మ (డిజిటల్ రవి) ఛాయాచిత్ర ప్రదర్శనను కె.వెంకటభూపేష్ ప్రారంభించారు.



యుద్ధరంగంలో ధీరవనిత


ఊహ నిజమౌతున్న వేళ

### బహుమతి ప్రదానోత్సవం..

చిత్రకళా బ్రహ్మోత్సవంలో భాగంగా విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 34వ వార్షికోత్సవానికి సంబంధించి కర్ణాటక రాష్ట్రం దార్వాడకు చెందిన దేవేందర్ ఎం.బాడీగర్‌కు భారత చిత్రకళారత్న గోల్డెన్ అవార్డుతో పాటు రూ.15వేలు నగదు బహుమతిని అందజేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మెట్ల సత్య చేతులమీదుగా విజేతలకు అమరావతి చిత్రకళారత్న గోల్డెన్ అవార్డు, మెగా గోల్డెన్ పద్మ అవార్డ్స్, బెస్ట్ గోల్డెన్ పద్మఅవార్డు, సూపర్ గోల్డెన్ పద్మఅవార్డు, ఆర్ట్ లెజెంట్ గోల్డెన్ పద్మ అవార్డులను 391 మందికి అందజేశారు. 35వ వార్షిక ప్రదర్శనలో జార్ఖండ్‌కు చెందిన రాజీవ్ అగర్వాల్, వినుకొండకు చెందిన జస్టిస్ వజ్రగిరి, మహారాష్ట్రకు చెందిన హేమ కుట్నికర్‌లకు భారత చిత్రకళారత్న బ్రహ్మోత్సవం అవార్డులతో పాటు ఒక్కొక్కరికీ రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశారు. మొత్తంగా 675 మందికి అవార్డులు, రివార్డులు అందించారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్, డాక్టర్ బసవా వరహాలు, శిల్పి రాజ్‌కుమార్ వడయార్, డాక్టర్ గోదశి గంగరాజు, పోలిశెట్టి అనంతలక్ష్మి, నల్లా పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు డాక్టర్ శ్యామ్‌జాదూగర్ బ్లైండ్ ఫోల్డ్ ఆర్ట్‌లో చేసిన మేజిక్ ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినొందిన ప్రముఖ చిత్రకారుల చిత్రాలతో ముద్రించిన అవర్ ఆర్టిస్ట్స్ బోర్క్ టూ ఎక్సెల్ పుస్తకాన్ని ఎమ్మెల్యే ఐవీ ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చిత్రకారుడు బత్తుల బాహూజీని కోనసీమ చిత్రకళాపరిషత్ తరపున చిత్రకళా సామ్రాట్ బిరుదుతో సత్కరించారు.


ముద్దుకే ముద్దొచ్చే సింగారం


గరగ నృత్యం


వెలుగులు నిండాలి


తాతా మనుమడి ఆప్యాయత


భారత చిత్రకళారత్న అవార్డు గెలుచుకున్న విజేత బాడీగర్‌కు సన్మానం


శ్యామ్ జాదూగార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఐవీ

## విద్యార్థులు క్రీడల్లో పట్టు సాధించాలి

'శ్రీప్రకాష్'లో మూడోరోజు జాతీయస్థాయి చెస్ పోటీలు

పెద్దాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో మంచి పట్టు సాధించాలని ప్రముఖ వ్యాపారవేత్త కె.రాజేష్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జరుగుతున్న జాతీయస్థాయి స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం మూడవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చెస్ క్రీడను ప్రోత్సహించేందుకు శ్రీప్రకాష్ పాఠశాల చేస్తున్న కృషి ఎంతో సంతోషదాయకమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేధాశక్తిని పెంపొందించడంలో చెస్‌కు మించిన క్రీడ మరొకటిలేదన్నారు. అలాగే ఇంటర్‌నేషనల్ అర్బిటర్ అరసును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన పోటీలను తిలకించారు. ఈకార్యక్రమంలో ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కేవీవీ శర్మ, కార్యదర్శి ఏసీఏ అడుసుమిల్లి సురేష్, అనంతరామ్, పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ తదితరులు ఉన్నారు.


చెస్ పోటీలను తిలకిస్తున్న శ్రీప్రకాష్ పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

## భీష్మ ఏకాదశికి మెరుగ్గా ఏర్పాట్లు

● సుమారు 70వేల మంది వస్తారని, 12వేల వ్రతాలు జరుగుతాయని అంచనా
● తొక్కిసలాట జరగకుండా ఎక్కడికక్కడ భక్తులకు హోల్డింగ్ పాయింట్లు
● అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సమీక్ష


సిబ్బందితో సమీక్షిస్తున్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

అన్నవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి భీష్మ ఏకాదశి పర్వదినాన వేలాదిగా విచ్చేసే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆదివారం సిబ్బందితో సమీక్షించారు. ఈ ఏడాది కార్తీకమాస ఏర్పాట్లు బాగున్నాయని, వాటికంటే మెరుగ్గా ఉండాలని చైర్మన్ రోహిత్ సూచించారు. భీష్మ ఏకాదశి పర్వదినం ఫిబ్రవరి 8 కాగా 7వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించాలని, ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. సుమారు 70వేల మంది వరకు దర్శనానికి విచ్చేస్తారని, 12వేల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రవాణా, తాగునీరు, పారిశుధ్యంపై దృష్టిసారించి ఎవరికీ ఇబ్బంది రాకుండా చూడాలని ఈవో ఆదేశించారు. అదనపు బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. భక్తులకు వ్రతం, దర్శన సమయంలో హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటుచేసి రద్దీకి అనుగుణంగా వాటి నుంచి వ్రత మండపాలు, దర్శన క్యూలైన్లలోకి పంపించాలని సూచించారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, ప్రధానంగా ఆన్‌లైన్ పేమెంట్ కౌంటర్ల వద్ద సుక్షితులైన వారిని నియమించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు ఉచిత అన్నప్రసాద సమయంలో ఎక్కువసేపు వేచిఉండకుండా మొదటి అంతస్తులో అందించే ఏర్పాట్లపై చర్చించారు. అతి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని ఈవో చెప్పారు. సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని ని ర్ణయించారు. సమావేశంలో సహాయ కమిష నరు సీహెచ్ రామ్మోహనరావు, ఏఈవోలు కొండలరావు, ఎల్.శ్రీనివాస్, కృష్ణారావు, జగ్గారావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, రాంబాబు, సూపరింటెండెంట్లు బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు, కృష్ణప్రసాద్, అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

## కన్నీరు పెట్టిస్తూ... సందేశాన్ని ఇస్తూ...

భోగాపురంలో ఆలోచింపజేసిన నాటికలు

పిఠాపురం/పిఠాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీతో మంచి చెడు ఉంది. దానిని ఉపయోగించే తీరుపై అది ఆధారపడి ఉంటుంది. రైతుల జీవితాల్లో అప్పుల కష్టాలు భాగమయ్యాయి. అవి వారి ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నాయి. ప్రభుత్వాలు సకాలంలో ఆదుకుంటే వారి బతుకులు బాగవుతాయి అంటూ కన్నీరు పెట్టిస్తూ సందేశాత్మకంగా సాగాయి కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో భోగాపురం నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో మూడో రోజు ప్రదర్శనలు. హైదరాబాద్‌కు చెందిన యువభేరి ఆర్ట్స్ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించిన నా శత్రువు నాటిక టెక్నాలజీ మన జీవితాల్లో తెచ్చిన మార్పులను సవివరంగా చాటిచెప్పింది. ఈ రోజుల్లో ఎవరికి వారు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లతో బిజీబిజీగా గడుపుతూ బంధాలు, అనుబంధాలకు దూరమై ఒంటరి వారైపోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మిత్రుడు లేడు. అలా కాకుండా ఏదో ఒకటి చేస్తూ అవసరం లేకున్నా దానిపైనే గడుపుతూ ఉంటే జీవితాలు చిన్నాభిన్నమవుతాయని ఈ నాటిక ద్వారా వివరించారు. ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా, వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు.


చీకటి బతుకులు నాటికలోని దృశ్యం


నా శత్రువు నాటికలోని ఓ సన్నివేశం

### రైతుల జీవితాల్లో...

రైతుల జీవితాల్లో సుఖదుఃఖాలు కలిసిమెలిసి ఉంటాయి. పంట పెట్టుబడులు కోసం రైతులు చేసే అప్పులే గుదిబండగా మారి వారి ప్రాణాలు తీసుకుంటున్నాయని కర్నాటక రాష్ట్రంలోని బళ్లారికి చెందిన జీఎన్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కళాకారులు ప్రదర్శించిన చీకటి బతుకులు నాటిక ద్వారా తెలియజెప్పారు. ఈ నాటిక ఆద్యంతం ప్రేక్షకుల కంట కన్నీరు పెట్టించింది. తమ జీవితాల మాదిరిగా ఉన్న ఈ నాటిక అందరిని ఆలోచింప చేసింది. జీఆర్ వెంకటేశులు ఈ నాటికను రచించి దర్శకత్వం వహించారు.

### ఈస్టిండియా పాలనలో..

కలకత్తా కేంద్రంగా ఈస్టిండియా పరిపాలన సమయంలో 1840లో జరిగిన సంఘటన ఆధారంగా హైదరాబాదులోని తెల్లాపూర్ మహతి క్రియేషన్స్ కళాకారులు ఉక్కు సంకెళ్లు నాటికను ప్రదర్శించారు. ఉక్కు సంకల్పం ఉంటే ఎవరైన దిగిరావాల్సిందే అని ఈ నాటిక ద్వారా చాటి చెప్పారు. ఈ నాటికను సింహప్రసాద్ రచించగా ఉప్పలూరి సుబ్బరాయశర్మ దర్శకత్వం వహించారు.

### జీవితకాల సాధన పురస్కారం అందజేత

ప్రముఖ రచయిత, నటుడు, నంది అవార్డు గ్రహీత తాళాబత్తుల వెంకటేశ్వరరావును అడపా అచ్చియమ్మ, మాణిక్యం స్మారక జీవితకాల సాధన పురస్కారంతో సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో భోగాపురం నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అడపా సూరిబాబు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మవ్యాప్తికి గాడ్ కృషి అభినందనీయం

ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు


గాడ్ వైభవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గరికపాటి, వక్తలు.. మాట్లాడుతున్న దుర్గాప్రసాదరావు

రాయవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మవ్యాప్తికి వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు అన్నారు. ఆదివారం గాడ్ 89వ జన్మదిన వేడుకలు పీఠం వద్ద ఉన్న సీతా సదనంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు యర్రాప్రగడ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు కృషి చేయడం సంతోషకరమని, హిందూ ధర్మవ్యాప్తికి మరింత కృషిచెయ్యాలని పిలుపునిచ్చారు. గాడ్ ఆధ్యాత్మిక సేవల ద్వారా తాను పుట్టిన ప్రాంతానికే కాకుండా తెలుగురాష్ట్రాల్లో పేరు పొందారన్నారు. భక్తులనుద్దేశించి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ప్రతిమనిషి దైవరాధన చేయడం ద్వారానే ఉత్తమ జీవనం సాగించడం సాధ్యమౌతుందన్నారు. సహస్రవాధాని గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ మనిషి కష్టాలకు కుంగిపోకుండా దైవం మీద నమ్మకంతో ముందుకు సాగాలని భగవంతుడ్ని నమ్ముకున్నవారికి ఎటువంటి కష్టాలు దరిచేరవన్నారు. ఈసందర్భంగా కోట శ్రీను దత్త రచించిన గాడ్ వైభవం పుస్తకాన్ని, పోస్టల్‌శాఖ ద్వారా తయారు చేసిన గాడ్ చిత్రంతో ఉన్న 5రూపాయిల స్టాంప్‌ను గరికపాటి, చిలకపాటి విజయ రాఘవాచార్యులు, తుమ్మిడి రామ్ కుమార్, ప్రసార భారతి విశ్రాంత డైరెక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు ఆవిష్కరించారు. శ్రీరంగం దేవస్థానం ఆచార్యులు పరాశర లక్ష్మి నరసింహ భట్టర్ గాడ్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, కోట సునిల్‌కుమార్ ఆధ్వర్యంలో కవులు సాహిత్తివేత్తలను గాడ్ సమక్షంలో ఘనంగా సత్కరించారు. హైదరాబాదుకు చెందిన యువకుడు వారణాసి రాఘవను పీఠం ఆస్థాన విద్యాన్‌గా నియమించడం తో పాటు సంగీత విద్వన్ మణి బిరుదుతో సత్కరించారు.

### గాడ్ ఆశీస్సులు పొందిన ప్రముఖులు

గాడ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి గాడ్‌ను సత్కరించి ఆశీస్సులు పొందారు. డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, డాక్టర్ విశ్వనాధ గోపాలకృష్ణ, డాక్టర్ గన్ని భాస్కరరావు, తుమ్మిడి రామ్‌కుమార్, మేడసాని మోహన్, అన్నవరం దేవస్థానం ఈవో డి.సుబ్బారావు, గొర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి నృత్య కళాకారుడు సప్పా దుర్గా ప్రసాద్ గాడ్ ఆశీస్సులు పొందారు.

## లిఫ్ట్ ఇస్తానని బంగారం దోచుకెళ్లాడు

వృద్ధురాలి మెడలో ఆభరణాల చోరీ

అనపర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బస్సు దిగి నడిచి వెడుతున్న వృద్ధ దంపతులను లిఫ్ట్ ఇస్తానని నమ్మించి వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని దుండగుడు దొంగిలించిన సంఘటన అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం కొప్పవరం రోడ్డులో శనివారం జరిగింది. ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తి మండలం కొప్పవరానికి చెందిన వృద్ధ దంపతులు సబ్బెళ్ల వెంకటరెడ్డి, వెంకయ్యమ్మ కాకినాడలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో లక్ష్మీనరసాపురం వంతెన వద్ద బస్సు దిగి కొప్పవరానికి నడిచి పయనమయ్యారు. కొంతదూరం వెళ్లిన తరువాత మోటారుసైకిల్‌పై వచ్చిన దుండగుడు వృద్ధురాలికి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఆమెను మోటార్ సైకిల్‌పై కొంతదూరం తీసుకువెళ్లాడు. అక్కడ నిర్మానుష్య ప్రదేశంలో బండి ఆపి ఆమె మెడలో ఉన్న మంగళ సూత్రాలతో ఉన్న రెండు పేటల బంగారు గొలుసు, నల్లపూసల దండతో సహా 8 తులాల బంగారంతో ఉడాయించాడు. వెంకటరెడ్డి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## నాన్న, అమ్మా క్షమించండి!

సూసైడ్ నోట్ రాసి వైద్య విద్యార్థి ఆత్మహత్య

స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు


సాయి మణిదీప్(ఫైల్)

నెల్లిమర్ల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం విద్యార్థి ఆత్కూరి సాయిమణిదీప్ (24) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తను ఉంటున్న హాస్టల్ గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఓ సూసైడ్ నోట్ రాసి అందులో డాడీ, అమ్మా, తమ్ముడూ నన్ను క్షమించండి అంటూ కోరాడు. నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన సాయిమణిదీప్ నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ గదిలో మణిదీప్‌తో ఉంటున్న తోటి విద్యార్థులు పండుగకు స్వగ్రామాలకు వెళ్లారు. ఇంకా రాలేదు. శనివారం రాత్రి 7 గంటల వరకు పక్క రూమ్ విద్యార్థులతో మాట్లాడి తలుపులు వేసుకున్న మణిదీప్ ఆదివారం ఉదయం 10 గంటల వరకు బయటకురాలేదు. పక్క రూమ్ వి ద్యార్థులకు సందేహం కలిగి కిటికీలో నుంచి చూశారు. మంచంపై లేకపోవడంతో గదిలోకి వెళ్లి పరిశీలించారు. బాత్‌రూమ్‌లో అచేతనంగా పడి ఉన్నట్లు గుర్తించారు. విషయం యాజమాన్యానికి తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడున్న ఆధారాల ఆధారంగా గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మణిదీప్‌కు బ్యాక్‌లాగ్ సబ్జెక్ట్ ఉండి పోయాయి. ఆ పరీక్షలు రాసేందుకు పండుగకు ఇంటికి వెళ్లలేదు. హాస్టల్‌లోనే ఉండి పోయాడు. ఓ పక్క ఏకాంతం, మరో పక్క మానసిక సంఘర్షణ కలిసి ఆత్మహత్యకు పురిగొల్పి ఉండవచ్చు. కళాశాల యాజమాన్యం, పోలీసులు ఇచ్చిన సమాచారంతో తల్లిదండ్రులు ఆత్కూరి శిరీష, ఆత్కూరి రామారావు, బంధువులు ఆదివారం సాయంత్రానికి నెల్లిమర్ల చేరుకుని భోరున విలపించారు. తండ్రి రామారావు నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో వికాస్ విద్యాసంస్థలో డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు కాగా మణిదీప్ పెద్ద కుమారుడు. చిన్న కుమారుడు గౌరీనంద్ బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు.

### కన్నీరు తెప్పిస్తున్న సూసైడ్ నోట్

సాయి మణిదీప్ మృతదేహం వద్ద పోలీసులకు లభించిన సూసైడ్ నోట్‌లోని అంశాలు కన్నీరు తెప్పిస్తున్నాయి. "డాడీ, అమ్మా, నన్ను క్షమించండి. గత పదేళ్లుగా మిమ్మల్ని చాలా చాలా కష్టపెట్టాను. బాధ పెట్టాను. నా వల్లే ఇంట్లో సంతోషం, ప్రశాంతత లేదు. నా వల్లే మీ ఆరోగ్యం కూడా బాగుండట్లేదు. ఎంత కష్టపడి చదువుదాం అన్నా చదవలేకపోతున్నా. రకరకాల ఆలోచనలు వస్తున్నాయి. గత 8-9 నెలల నుంచి సూసైడ్ ఆలోచనలు తినేస్తున్నాయి. కానీ ఎవరికీ చెప్పలేను. నా వల్ల తమ్ముడు కూడా చాలా బాధపడుతున్నాడు. ఇంట్లో పరిస్థితుల వల్ల నాకు నేనే పిచ్చోడిలా అనిపిస్తున్నా. అమ్మా నా కోసం ఎంతో చేశారు. నేను మాత్రం మిమ్మల్ని బాధలు పెడుతూనే ఉన్నా. మీ నిద్ర, ఆరోగ్యం అన్నీ నా వల్లే పోతున్నాయి. బతకాలి అంటే భయమేస్తోందమ్మా. నా గురించి కాదు, ఇంకా ఎంత కాలం మిమ్మల్ని బాధ పెడతా అని, మీరు ఆనందంగా ఉండటమే నాకు కావాలి. డాడీ, అమ్మా నన్ను క్షమించండి" అని సాయి మణిదీప్ ఆ లేఖలో రాశాడు.

### మిమ్స్‌లో విషాదం

మిమ్స్‌లో వైద్య విద్యార్థి సాయిమణిదీప్ ఆత్మహత్య ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. యాజమాన్యం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. తోటి విద్యార్థులు సైతం కన్నీరుమున్నీరయ్యారు. మణిదీప్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. నెల్లిమర్ల ఎస్‌ఐ బి.గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అయ్యో.. ఐదేళ్ల పాపకు ఎంత కష్టం

● విద్యుత్ షాక్‌తో చేయిని కోల్పోయిన కూతురు ● తల్లికి తీవ్రగాయం


చేయిని కోల్పోయిన కేతా లాస్యమాధురి


గాయపడ్డ రమాదేవి

అల్లవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి కొత్తకాలనీలో తల్లి కేతా రమాదేవి డాబాపై దుస్తులు ఆరవేస్తుండగా ఆడుకునేందుకు డాబా పైకి వచ్చిన ఐదేళ్ల కూతురు కేతా లాస్యమాధురి విద్యుత్ తీగ వల్ల షాక్‌కు గురై శనివారం తీవ్రంగా గాయాలపాలైంది. సంక్రాంతి సెలవులకు కాకినాడ నుంచి గోడి వచ్చిన లాస్యమాధురి డాబాపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ విద్యుత్ ప్రమాదానికి గురైన సమయంలో కుమార్తెను రక్షించబోయిన తల్లి రమాదేవి కూడా తీవ్రంగా గాయపడింది. తల్లీకూతుళ్లను కాకినాడ జీజీహెచ్‌కు తరలించి అత్యవసర వైద్యసేవలు అందించారు. తీవ్రంగా గాయపడిన లాస్యమాధురి కుడి చేతిని శస్త్ర చికిత్స చేసి కాకినాడ జీజీహెచ్ వైద్యులు తొలగించారు. తమ ఇంటిపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి, తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే చిన్నారి లాస్యమాధురి చేతిని కోల్పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తల్లీకూతుళ్ల విద్యుత్ ప్రమాదానికి గురైన సంఘటన గోడి గ్రామాన్ని కుదిపివేసింది. నివాస ప్రాంతాల్లో ప్రమాదకర విద్యుత్ తీగలను తొలగించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఈ సంఘటనపై అల్లవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

## బంధువుల ఇంట ఫంక్షన్‌కు బయల్దేరి..

ట్యాంకర్ లారీ ఢీకొనడంతో యువకుడు మృతి


శివ మృతదేహం వద్ద విలపిస్తున్న అత్త నారాయణమ్మ

ప్రత్తిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం కథనం మేరకు ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రాజమాణి శివ(22)తునిలో బంధువుల ఇంట జరిగే ఫంక్షన్‌కు బయల్దేరగా అతడి వెనుక బావ గొంప భాను, భాను తల్లి నారాయణమ్మ రెండు వేర్వేరు మోటార్ బైక్‌లపై బయల్దేరారు. ధర్మవరం పెట్రోల్‌బంకు సమీపంలో హోండా ఫ్యాషన్‌ప్లస్ బైక్‌పై వెళ్తున్న రాజమాణి శివను వెనుక నుంచి ట్యాంకర్ లారీ పక్కనే మరో లారీ ఓవర్ టేక్ చేస్తూ శివ బైక్‌ను ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే శివ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు...

ఏలేశ్వరం మండలం పేరవరంలో వ్యవసాయ కూలి పనులు, మేకలు, గొర్రెలు పెంపకం పనులు చేసుకునే రాజమాణి శ్రీను, రమణమ్మలకు శివ, మరో అబ్బాయి సంతానం. కూలిపనులు చేస్తూ కుటుంబ పోషణలో చేతికి అందివచ్చిన శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటం పట్ల కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. సంఘటనా స్థలం వద్ద మృతుడి బావ, అత్త నారాయణమ్మ షాక్‌తో విలవిల్లాడారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

## వేమన పద్యాలు.. జీవిత సత్యాలు: జేసీ


వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): యోగి వేమన రాసిన పద్యాలు మనిషి జీవితాలను మేలుకొలిపే సత్యాలని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. యోగివేమన జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం వేమన చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవిత సత్యాలను పద్య రూపంలో అందించిన మహోన్నతమైన వ్యక్తి యోగి వేమన అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, ఏవో ఎండీ ఆలీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బర్రే కొండబాబు గృహనిర్బంధం


గృహనిర్బంధంలో ఉన్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థాయి సంఘం మాజీ చైర్మన్ బర్రే కొండబాబును ఆదివారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. క్వారీ గోతులను ఈ నెల 18వ తేదీలోగా పూడ్చకపోతే దీక్ష చేస్తానని ముందస్తుగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం దీక్షకు సిద్ధమై జాతీయ జెండాతో బయటకు వచ్చిన కొండబాబును అడ్డగించి గృహనిర్బంధం చేశారు. దీంతో పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఉదయం నుంచి పోలీసులు క్వారీ ప్రాంతం సుబ్బారావు నగర్‌లోని బర్రే నివాసం వద్ద మోహరించారు. కొండబాబు మాట్లాడుతూ 2011 నుంచి క్వారీ గోతులను పూడ్చాలని ఉద్యమం చేస్తున్నానన్నారు. తనను గృహనిర్బంధం చేసినా ఉద్యమం ఆగదన్నారు. సమస్య పరిష్కరించకపోతే హైవేను నిర్బంధించి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## జీమా కార్యవర్గ ప్రమాణస్వీకారం


జిత్ మోహన్‌మిత్రను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (జీమా) 7వ వార్షికోత్సవం గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్‌మిత్ర కళావేదికపై ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా సంఘ అధ్యక్షుడు డీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎంఎస్.చక్రధర్, కేవీవీఎస్ అవధాని, కార్యదర్శి డి.సురేంద్ర, కోశాధికారి పిచ్చుక మహేష్, జాయింట్ సెక్రటరీ ఎం.సాయిరాం ప్రమాణ స్వీకారం చేశారు.జిత్ మోహన్ మిత్రను నటగాయక బిరుదుతో జీమా సభ్యులు సత్కరించారు. ఈ కార్య క్రమంలో సినీ హాస్యనటుడు గౌతంరాజు,దర్శకుడు ఆనంద సాగర్, ఎస్.ఎస్.స్వామి,బాబీ, జీమా ఫౌండర్ కె.మహేష్ పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులకు సర్టిఫికెట్లు



రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలను ప్రజలకు అందిస్తామని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి పేర్కొన్నారు.కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ దల్‌సింగ్, సొసైటీ సభ్యులు మహాలక్ష్మి,కేవీ.రమణ,బండి వెంకటేశ్వరరావు, ట్రైనర్ ధర్మారావు పాల్గొన్నారు.

# ఫిల్టర్ బెడ్

- రాజానగరంలో పడకేసిన రావులచెరువు ఫిల్టర్ బెడ్
- నిర్వహణా లోపమే కారణం
- నిర్లక్ష్యంతో రూ.30 లక్షల నిధులు గంగపాలు
- పట్టించుకోని అధికారులు


రాజానగరంలోని రావులచెరువు గట్టున ఫిల్టర్ బెడ్

రాజానగరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజానగరం పరిసర మెట్ట ప్రాంత ప్రజానీకానికి దాహార్తిని తీర్చేందుకు నెలకొల్పిన రావులచెరువు ఫిల్టర్ బెడ్ అధికారుల నిర్లక్ష్యంతో పాటు నిర్వహణా లోపంతో గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసినా చాగల్నాడు ప్రాంత ప్రజలకు గోదావరి జలాలతో దప్పిక తీర్చుకునే ఆశలు ఆవిరైపోయాయి. లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మించిన ఫిల్టర్ బెడ్ పూర్తిగా అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది.


ఖాళీగా దర్శనమిస్తున్న ఫిల్టర్ బెడ్ సంపు

### మూడున్నర దశాబ్దాల క్రితం..

రాజమహేంద్రవరం నుంచి పైపు లైన్ల ద్వారా శుద్ధి చేసిన గోదావరి జలాలను చాగల్నాడు ప్రాంత ప్రజలకు అందించాలనే సంకల్పంతో గత మూడున్నర దశాబ్ధాల కిందట జాతీయ రహదారి వెంబడి పైపు లైన్లు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా లాలాచెరువు, గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో భారీ పరిమాణంతో కూడిన జీఎల్ఆర్ ట్యాంకులను నిర్మించారు. ట్యాంకుల నుంచి లాలాచెరువు, శ్రీరాంపురం, దివాన్‌చెరువు, చక్రద్వారబంధం గ్రామీణ ప్రాంత ప్రజలకు పైపులైన్ ద్వారా శుద్ధి చేసిన గోదావరి తాగునీరు సరఫరా జరుగుతుండేది. ఈ క్రమం లో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగం గా పైపులైన్ పూర్తిగా ధ్వంసమై నీటి సరఫరా నిలిచిపోయింది. అనంతరం అప్పటి రోడ్డు భవ నాల శాఖామంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సంబంధిత శాఖాధికారులతో చర్చించి ఎలాగైనా నీటి సరఫరాను పునరుద్ధరించాలని కంకణం కట్టుకున్నారు. ఆయన చొరవతో రూ.30 లక్షలతో రాజానగరంలో రావులచెరువు గట్టున ఫిల్టర్ బెడ్ నిర్మితమైంది.


ఇన్‌టేక్ వెల్

### శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు..

చాగల్నాడు కాలువ ద్వారా గోదావరి నీటిని రాజానగరంలోని దాదాపు 35 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న రావులచెరువులోకి మళ్లించి, ఇంటేక్ వెల్ ద్వారా చెరువు గట్టున భారీ పరిమాణంలో ఉన్న ట్యాంకులోకి మోటార్ల ద్వారా తోడుతుంది. ఇక్కడ ట్యాంకులో అడుగు భాగంగా గోదావరి ఇసుకను, మరో లేయర్‌ను చిన్న క్వారీ కంకరతో వేసేవారు. ఈ ప్రక్రియలో ట్యాంకుల్లోని శుద్ధి చేసిన గోదావరి నీటిని రాజానగరం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు పైపులైన్ ద్వారా సరఫరా అవుతుండేది.

### పట్టించుకోని పంచాయతీ..

లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించిన ఫిల్టర్ బెడ్ నిర్వహణ పట్ల పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### వైసీపీ పాలనలో గాలికి..

రాజానగరం పంచాయతీ ప్రజానీకానికి శుద్ధి చేసిన, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే దృఢ సంకల్పంతో దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో రూపుదిద్దుకున్న రావులచెరువు ఫిల్టర్ బెడ్ అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో గత వైసీపీ పాలనలో పూర్తిగా గాలికి వదిలేశారు. కొన్నేళ్లుగా చెరువులోని నీటిని శుద్ధి చేసే విధానానికి స్వస్తి చెప్పి నేరుగా పైపు లైన్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మొక్కుబడిగా ఒక బెడ్‌ను సిద్ధం చేసి నీటి సరఫరా మొదలుపెట్టారు.

## సప్లై కంపెనీ సంఘ వనసమారాధన

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి మైక్ అండ్ లైటింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వనసమారాధన చేశారు. పాత బొమ్మూరు రామకృష్ణ తోటలో జరిగిన వన సమారాధనలో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుల్లివల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పొట్లూరి వసంతకుమార్, కోశాధికారి బెవర రామారావు, కొల్లి గణేష్ తదితరులు పర్యవేక్షించారు.

## కడియపులంకలో పూర్వ విద్యార్థుల కలయిక


కడియపులంక జడ్పీ హైస్కూల్ 1995-2000 బ్యాచ్ విద్యార్థులు

కడియం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-2000 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు 'రీ యూనియన్ 2025' పేరిట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు, ఆనాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన హెచ్‌ఎం కె.సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు కుమారి, సూర్యబేగం, శ్రీనివాస్, అరిగెల సూరిబాబులను, గుమస్తా జోషి, నైట్ వాచ్‌మెన్ రవణమ్మలను సత్కరించారు. కార్యక్రమంలో గెడ్డం శివ, కాదంబరి సూర్యశ్రీనివాస్, కొత్తపల్లి శివాజీ, చెక్కపల్లి శివ, పేకేటి బ్రహ్మాజీ, దొడ్డా సూరిబాబు, సిద్దిరెడ్డి భానుప్రకాష్, పాఠంశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైళ్ల ప్రయాణికులతో రద్దీగా సర్వీసులు వెళ్తున్నాయి. సంక్రాంతి పండగను ముగించుకున్న జిల్లా ప్రజలు తిరుగు ప్రయాణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నుంచి రాజమహేంద్రవరం చేరుకుని ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రైళ్ల కోసం వేచి చూశారు. దీంతో రైల్వే స్టేషన్ ప్రయాణికులతో నిండింది. అదేవిధంగా రైళ్లు కూడా రద్దీగా నడుస్తున్నాయి.

## ఆధ్యాత్మికతలో ఉన్న శాస్త్రీయతను గుర్తించాలి

సత్యసాయి జయంతి సభలో గరికిపాటి నరసింహారావు


సత్యసాయి గురుకులంలో డాక్టర్ గరికిపాటి

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతలో ఉన్న శాస్త్రీయతను గుర్తించి సేవ, ప్రేమతత్వాన్ని పెంపొందించుకోవాలని పద్మశ్రీ మహా సహస్రావధాని డాక్టర్ గరికిపాటి నరసింహారావు పిలుపునిచ్చారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో ప్రేమ-సేవ అంశంపై ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. నేను, నాది అనే అహంకారాన్ని దూరం చేసుకుంటే, స్వార్థ రహిత సేవ ద్వారా ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందవచ్చన్నారు. ఎన్ని చదువులు చదివినా బ్రహ్మజ్ఞానం లేనప్పుడు, ఆ చదువుకు సార్థకత ఉండదన్నారు. వృద్ధాప్యంపై బాధపడకుండా గత జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆనందంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. కష్టాన్ని కూడా సుఖంగా మార్చుకోవాలని, ఉన్న దాంతో సంతృప్తి చెందడమే వైరాగ్యమన్నారు. ఉచిత పథకాలను వదిలిపెట్టి, ఉపాధి కల్పన కల్పించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. చిత్త శుద్ధితో చేసే ఏ పనైనా మోక్షానికి మార్గమన్నారు. పండుగలు, సంప్రదాయాల్లో ఉన్న అంతరార్థాలను గుర్తించి వ్యతిరేక భావాలను తొలగించుకోవాలన్నారు. సుమారు 250 దేశాల్లో ఉన్న సత్యసాయి సేవా సంస్థలను యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా డాక్టర్ గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రసంగాన్ని ఏర్పాటు చేశామని, నవంబరు 23 వరకు అనేక సమాజ సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడతామని జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ గోవిందరాజులు, శ్యాంసుందర్, గురవయ్య, ప్రముఖ వైద్యులు గోలి రామారావు, డాక్టర్ కె.ప్రభాకర్, దండమూడి గిరిధర్ పాల్గొన్నారు. సమితి సభ్యులు గరికిపాటిని ఘనంగా సత్కరించారు. సేవా సమితి సభ్యులు, సేవాదళ్ సభ్యులు, బాలవికాస్ గురువులు, గురుకులం విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలి

- మాత విద్యానందగిరి
- దేవరపల్లిలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహోత్సవాలు


మహోత్సవాలకు విచ్చేసిన సాధు పుంగవులు

దేవరపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక, ధార్మిక చైతన్యం, సామాజిక స్పృహ, దేశభక్తి కలిగి ఉండి ప్రశాంతమైన వాతావరణంలో ఆరోగ్యమైన జీవితాన్ని గడపాలని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాత విద్యానందగిరి అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్ హాలులో అఖిలాంధ్ర సాధు పరిషత్ 60వ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలకు సుమారు 400మంది సాధువులు విచ్చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు భగవద్గీత పారాయణం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సాధు పుంగవులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన వారు అన్నమాచార్య కీర్తనలు గానం చేశారు. దేవరపల్లి ఆది శంకరాచార్య ధ్యానమందిరం మహిళా కమిటీ సభ్యులు సౌందర్య లహరి పారాయణ చేశారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు గద్దే మునేశ్వరరావు, బళ్ళా సూర్యచక్రం, బలుసు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, సుంకవల్లి రామారావు, గన్నమని హరికృష్ణ, కరుటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న సాధువులు

## సీఎం సహాయ నిధి సాయం అందజేత


లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల ఆరోగ్యానికి ఆర్థిక సహకారం అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో వాడపల్లికి చెందిన బెజవాడ పోశమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన రూ.30,028 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఎం. సురేష్, ఎస్. సత్తిబాబు పాల్గొన్నారు.

## పాలనా సంస్కరణలతో ప్రభుత్వానికి సార్థకత

చాగల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పాలనా సంస్కరణలు అమలు చేసినప్పుడే మంచి ప్రభుత్వానికి సార్థకత వస్తుందని పారిశ్రామికవేత్త, సుంకవల్లి ఫౌండేషన్ చైర్మన్ సుంకవల్లి వెంకన్నచౌదరి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మార్కొండపాడు స్వగ్రామం విచ్చేసిన ఆయన గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలని, పాలనలో వేగం పెరగాలన్నారు.

## చెరువులో పడి యువకుడి మృతి

సీతానగరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన చండిక వెంకటేష్ (34) ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు వ్యవసాయదారుడైన వెంకటేష్‌కు చిన్నతనం నుంచి ఫిట్స్ వ్యాధి ఉందన్నారు. ఆదివారం ఉదయం బహిర్భూమికి శుద్ధ చెరువు వద్దకు వెళ్లిన వెంకటేష్‌కు ఫిట్స్ రావడంతో చెరువులో పడి మృతి చెందాడన్నారు. అవివాహితుడైన ఇతనికి తండ్రి పాపారావు, తల్లి శ్యామల, అన్న ఆనంద్, తమ్ముడు హరికృష్ణ ఉన్నారని తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోదరుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 'అమిత్‌షా గో బ్యాక్'


దేవరపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తప్పించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటన నిరసిస్తూ 'అమిత్‌షా గో బ్యాక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రత్నాజీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు సీహెచ్ రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా వచ్చిన పదవులు అనుభవిస్తూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించడం దారుణమన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగానే అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. రాజ్యాంగం పట్ల అమిత్‌షాకు ఏ మాత్రం గౌరవం ఉన్నా వెంటనే హోం మంత్రి పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకుని అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ఆచంట సత్యనారాయణ, ఏఐటీయూసీ నాయకుడు పెంటయ్య, సీపీఎం నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని సత్యనారాయణ, ఆచంట సుభాష్‌చంద్రబోస్, మేడా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాశాలమ్మ అమ్మవారికి రూ.లక్ష విరాళం


కాపవరంలో పాశాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు

కోరుకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తనది గోకవరం గ్రామం అయినప్పటికీ కోరుకొండ గ్రామస్తుడిగా చూడాలని రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. కోరుకొండ, కాపవరం, పశ్చిమగోనగూడెం, శ్రీరంగపట్నం గ్రామాలకు ఏ అవసరం వచ్చినా చేయడానికి ముందుంటానన్నారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో గ్రామదేవత పాశాలమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. అయిదు రోజులుగా సాగుతున్న అమ్మవారి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి అన్న సమారాధనకు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. జాతరలో పాల్గొన్న మహిళలకు 100 చీరలను లాటరీ పద్ధతిలో అందించారు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకుడు మామిడి అయ్యప్ప, వినకోటి రామన్నదొర, వరుసాల ప్రసాద్, కట్ట కల్యాణ్, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సత్తెమ్మ అమ్మవారికి సినీ డైరెక్టర్ కృష్ణారెడ్డి పూజలు


కొంకుదురులో సినీ డైరెక్టర్ కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న చిన్నం వంశీయులు

బిక్కవోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కొంకుదురులో చిన్నం వంశీయుల ఇలవేల్పు అయిన సత్తెమ్మతల్లి సంబరం సందర్భంగా చిన్నం వారి అల్లుడైన సినీ డైరెక్టర్ ఎస్‌వి కృష్ణారెడ్డి ఆదివారం సత్తెమ్మ తల్లిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈసందర్భంగా చిన్నం వంశీయులు కృష్ణారెడ్డికి అమ్మవారి చిత్ర పటం అందించి సత్కరించారు. అంతకు ముందు అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

**బిక్కవోలులో...** బిక్కవోలు జువ్వలదొడ్డిలో గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సత్తెమ్మ తల్లి జాతర ఆదివారం జరిపారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఈయన వెంట వైసీపీ నేతలు పి.ప్రసాదరెడ్డి, బుద్దాల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## గంటాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు


గంటాలమ్మను దర్శించుకున్న రజక సంఘం రాష్ట్ర నాయకుడు సీతారాముడు

కోరుకొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కోరుకొండ గ్రామదేవత గంటాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రాష్ట్ర రజక చైతన్య సంస్థ అధ్యక్షుడు మాతా సీతారాముడు గంటాలమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సంక్రాంతి సందర్భంగా ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు అయిదు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సీతారాముడు మాట్లాడారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరరావు, పడగళ్ళపాటి కోటిబాబు, శ్రీను, పులిపే రామలక్ష్మి, ముచ్చిం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బిక్కవోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఉన్నత పాఠశాలలో 1977-78లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో తమకు విద్యనేర్పిన గురువులను వారు సత్కరించారు. అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో చాగంటి సాయి బాబారెడ్డి, డీఎల్ కుమార్, జిలాని, గాంధీ, కాకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బిక్కవోలు ఉన్నత పాఠశాలలో 48 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు




ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలి

» మాతా విద్యానందగిరి 8

లిఫ్ట్ ఇచ్చి..బంగారు గొలుసు లాగేశాడు

మూడు ర్యాంపుల్లో నిలిచిన ఇసుక తవ్వకాలు


## నేడు రాజానగరంలో పీజీఆర్ఎస్‌కు కలెక్టర్



రాజానగరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలస్థాయిలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతారని తహశీల్దార్ జి.అనంత లక్ష్మి సత్యవతి దేవి ఆదివారం తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే రాజానగరం మండల స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఈ సోమవారం కలెక్టర్ విచ్చేస్తున్నారన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండల ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు.మండల పరిధిలో భూసమస్యలు ఎక్కువ కావడంతో ఆయా సమస్యలపై ఎక్కువగా అర్జీదారులు వచ్చే అవకాశం ఉంది.ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల స్థాయిలో అధికారులంతా సమావేశానికి హాజర య్యేలా చర్యలు చేపట్టారు. ఎందుకంటే గతంలో నల్లజర్లలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పాల్గొనగా కొంత మంది అధికారులు గైర్హాజర య్యారు.దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్టు సమాచారం.

### కలెక్టరేట్‌లో యథావిధిగా..

రాజమహేంద్రవరం సిటీ:కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ యథా విధిగా సాగుతుందని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు.జిల్లాలో ప్రజలు కలెక్టరేట్‌కు వెళ్లి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

## చదవలేక.. చచ్చిపోతున్నా!


- వివరాలు మెయిన్‌లో..


ఎంతో మందికి ఊపిరిపోయాల్సిన చదువు అతని ఊపిరినే తీసింది.. మూడేళ్లు కష్టపడి ఎంబీబీఎస్ చదివాడు.. ఈ ఏడాదితో చదువు పూర్తయిపోతోంది.. ఈ ఏడాది మా అబ్బాయి ఎంబీబీఎస్ పూర్తయిపోతుందని కుటుంబీకులు తెలిసినవారందరికీ చెప్పుకుంటున్నారు.. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయలేదు..అలాగని ఎంబీబీఎస్ పూర్తి చేయలేదు.. ఎందుకంటే అతనికి బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి.. చివరి ఏడాది కావడంతో చదువు పూర్తయిపోవాల్సిందే.. లేకపోతే ఇటు ఇంట్లో..అటు బంధువుల్లోనూ తలెత్తుకోలేడు..ఆ ఒత్తిడిలో ఎంతో మదన పడ్డాడు.. బయటపడలేకపోయాడు.. గత 8 నెలలుగా ఒక్కటే ఆలోచన.. ఆత్మహత్య చేసుకోవాలని.. కానీ మనసుకు అదుపు చేసుకుంటూ వచ్చాడు.. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు.. సంక్రాంతి సెలవులకు ఇంటికి రాలేదు.. పరీక్షలు ఉన్నాయని చెప్పాడు.. పండుగకు అందరూ వెళ్లిపోవడంతో హాస్టల్‌లో ఒక్కడే ఉన్నాడు.. ఆ ఆలోచన మరింత పెరిగింది.. డాడీ.. అమ్మా..తమ్ముడు నన్ను క్షమించండి అంటూ శనివారం ఒక లెటర్ రాసి.. ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. ఈ విషాద ఘటన విజయనగరం జిల్లా నెల్లిమర్ల మిమ్స్ మెడికల్ కాలేజీలో జరగ్గా..తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో విషాదఛాయలు అలుముకున్నాయి.



అయ్యో పాపం : ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇటీవల కాకినాడ సముద్ర తీరాన మృత్యువాత పడిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు





# నో..లివ్!

## తీరాన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత్యుఘోష

- గుడ్లు పెట్టేందుకు వచ్చి మృతి
- తీరం పొడవునా కళేబరాలు
- కాలుష్యమే కారణంగా అంచనా
- ఒక్కో తాబేలు 120 గుడ్లు
- అయినా అంతరించే ప్రమాదం
- డిప్యూటీ సీఎం పవన్ దృష్టి
- హోప్‌ఐలాండ్‌లో వేట నిషేధం
- కాపాడేందుకు చర్యలు

సర్పవరం జంక్షన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సాగరతీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మృత్యువాత పడుతున్నాయి. వేల కిలోమీటర్ల నుంచి రాష్ట్ర తీరప్రాంతానికి గుడ్లు పెట్టేందుకు వస్తున్న తాబేళ్ల సముద్రతీరంలో ఎక్కడ చూసినా చనిపోయిన దర్శనమిస్తున్నాయి. సముద్రంలో అరుదుగా లభించే జాతిగా పేరొందిన ఈ తాబేళ్ల విదేశాల నుంచి వేలాది కిలో మీటర్లు ఈదుకుంటూ వచ్చి తీరప్రాంతంలో గుడ్లు పెడతాయి. అలా వచ్చిన తాబేళ్లు చనిపోతుండడం కలవరానికి గురిచేస్తోంది. తీరప్రాంతాలకు ఆనుకుని ఉన్న పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన కాలుష్యం,వేటగాళ్ల వలలకు చిక్కుకోవడం, ఇంజన్ పంకాకు తాబేళ్ల తగిలి మృత్యువాత పడుతున్నట్టు అంచనా. దీనిపై ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాబేళ్లను సంరక్షించాలని..మృతికి గల కారణాలు అధ్యయనం చేయాలని.. సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు అటవీ అధికారులు కాకినాడ హోప్ ఐలాండ్ ప్రాంతంలో తాబేళ్ల సంరక్షణలో భాగంగా మార్చి వరకు చేపల వేట నిషేధించారు.

### గుడ్లు పెట్టేందుకే రాక..

రాష్ట్రంలో 974 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఆలివ్ రిడ్లీ తాబేళ్ల థాయిలాండ్, మలేషియా, ఇండోనేషియా తదితర తీర ప్రాంత దేశాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి కాకినాడ, కోనసీమ, బాపట్ల, నెల్లూరు తీర ప్రాంతాలకు డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుడ్లు పెట్టేందుకు వస్తాయి. ఇవి రాత్రి సమయంలో తీరంలోని సముద్ర ఇసుకలోకి వచ్చి గోతులు తయారు చేసుకుని, వాటిలో ఒక్కో ఆడ తాబేలు 60 నుంచి 120 వరకు గుడ్లు పెడుతుంటాయి. గుడ్డు నుంచి పిల్లలగా మారేందుకు 50 రోజుల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుడ్లు పెట్టేందుకు ఒక్కో గొయ్యి కోసం ఇవి సుమారు గంట వరకు సమయం తీసుకుంటాయి. జనసంచారం, జంతువుల సంచారం లేని రాత్రి సమయంలో ఇవి ఒడ్డుకు వచ్చి గుడ్లు పెడతాయి. అయితే జిల్లాలో అద్దరిపేట సముద్ర తీరం నుంచి కాకినాడ తీరం వరకు 35 కిలోమీటర్ల మేర ఎక్కడ చూసినా మృతి చెందిన ఆలివ్ రిడ్లీ తాబేళ్లు దర్శనమిస్తున్నాయి. ఉప్పాడ, కాకినాడ రూరల్ నేమాం, సూర్యారావుపేట, వాకలపూడి, కుంభాభిషేకం బీచ్‌లో తాబేళ్ల కళేబరాలు దర్శనమిస్తోండడం ఆందోళన కలిగిస్తోంది. సముద్ర తీరం ఆనుకుని ఉన్న పలు పరిశ్రమలు విడుదల చేసే కాలుష్య కారకాలతో ఇవి మృతి చెందుతున్నాయి. మత్స్యకారులు ఇంజన్ బోట్లతో చేపల వేటకు వెళ్లే సమయంలో వలలో చిక్కుకోవడం, ఇంజన్ బోటు పంకాల్లో పడి ఇవి మృత్యువాత పడుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు.

### జెల్లీ చేపలే ఆహారం..

సముద్ర పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో ఆలివ్ రిడ్లీ తాబేళ్ల కీలకపాత్ర పోషిస్తాయి. సముద్రంలో ఆక్సిజన్, చేపల సంతానం వృద్ధికి తాబేళ్ల దోహదం చేస్తాయి.సముద్రంలో ఉండే చేపపిల్లలను ఆహారంగా తీసుకుని జీవించే జెల్లీ చేపలను తాబేళ్ల ఆహారంగా తీసుకుంటాయి.దీంతో మత్స్య సంపద అంతరించకుండా వృద్ధి అయ్యేలా పరోక్షంగా కీలకపాత్ర పోషిస్తాయి. తాబేలు లోతులో ఉన్నా ప్రతి 45 నిమిషాలకు ఒకసారి సముద్రం పైకి వచ్చి ఆక్సిజన్ విడుదల చేస్తుంది. అలా సముద్రం పైకి, లోపలికి వచ్చి, వెళ్లడం ద్వారా నీటిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. సముద్ర పర్యావరణాన్ని కాపాడేందుకు తాబేళ్ల మేలు చేస్తాయి.

### అరుదైన జాతి..అయినా!



ఆలివ్ రిడ్లీ తాబేళ్ల అంతరించుకుపోతున్న అరుదైన తాబేళ్ల జాతిగా ప్రపంచ పర్యావరణ నిపుణులు ప్రకటించారు. ఆలివ్ రిడ్లీ తాబేళ్ల 7 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో ఐదు రకాలు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నాయి. రెండు అడుగుల వెడల్పుతో ఉండే ఈ తాబేలు 50 కిలోల బరువు ఉంటుంది. ఇవి 20 వేల కిటోమీటర్లు దూరం ప్రయాణించి తీరానికి వస్తున్నాయి.గుడ్డు నుంచి పిల్లగా ఎదిగిన ఈ తాబేళ్ల ఎక్కడికి వెళ్లినా తిరిగి ఇక్కడికే వచ్చి గుడ్లు పెట్టడం వీటి ప్రత్యేకత. దేశంలో ఒడిశా తర్వాత ఈ తాబేళ్ల రాష్ట్రంలోకి అధికంగా రావడం, గుడ్లు పెట్టడం వెళ్లిపోవడం జరుగుతుంటుంది. బాపట్ల సూర్యలంక, గుంటూరు జిల్లా నిజాంపట్నం,నాగాయలంక జింకపాలెం, కృష్ణా జిల్లా కోడూరు, కాకినాడ తీరంలో ఉప్పాడ, కాకినాడ, హోప్‌ఐలాండ్, కోరంగి అభయారణ్యం తదితర సముద్రతీర ప్రాంతాలకు ఆలివ్ రిడ్లీ తాబేళ్ల ఎక్కువగా వస్తుంటాయి.




# ఆరోగ్యం.. బాగాలేదు!

## 27 శాతం మందికి బీపీ.. 20 శాతం మందికి షుగర్

తూర్పుగోదావరి జిల్లాలో బీపీ ఉన్నవారు ఎంత మందో తెలుసా 27 శాతం.. షుగర్ ఉన్నవారెంత మందో తెలుసా 20 శాతం.. ఈ లెక్క ఎలా తెలిసిందంటారా.. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే చేస్తున్నారు.. ప్రతి రోజూ పది గృహాలకు వెళ్లి సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.. అనుమానం వస్తే చాలు పరీక్షలు చేస్తున్నారు.. ఈ విధంగా పెద్ద ఎత్తున క్యాన్సర్ పేషెంట్లు బయటపడుతున్నారు.. జిల్లాలో మొత్తం 18,13,818 మంది ఉంటే ఇప్పటి వరకూ 2,70,106 మంది ఆరోగ్యంపై ఆరా తీయగా చాలా మందిని రోగాలు వెంటాడుతున్నట్టు తేలింది. ఈ సర్వే జూలై వరకూ సాగనుంది.

- పెరుగుతున్న క్యాన్సర్ పేషెంట్లు
- జిల్లావ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే
- 2.7 లక్షల మంది నుంచి ఆరా
- మిగిలింది 12.5 లక్షలు
- ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు
- అనుమానితులకు క్యాన్సర్ టెస్ట్
- రోగి వివరాలన్నీ ఆన్‌లైన్
- ఎక్కడైనా వైద్యానికి అవకాశం




(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జిల్లా ప్రజానీకం ఎలా ఉన్నారు.. అంతా ఆరోగ్యంగా ఉన్నారా..?ఏ రకమైన అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నారా..? అసంక్రమిత వ్యాధుల (ఎన్‌డీసీ) సర్వే జిల్లా వ్యాప్తంగా ప్రజానీకం రోగాల లెక్క తేలుస్తుంది.18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులందరికీ ప్రభుత్వం ఉచితంగా పలు రకాల ఆరోగ్య పరీక్షలు చేస్తోంది. అందరికీ బ్రస్ట్, నోరు, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారు.ఈ సర్వే 8 నెలల పాటు జరుగుతోంది.

### 2,70,160 మందికి పరీక్షలు

జిల్లాలో మొత్తం 6,48,311 నివాసితులు ఉన్నారు. 18 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు 18,13,818 మంది ఉన్నారు.వీరిలో ఇంత వరకూ 1,00,839 నివాసితులకు సంబంధించిన 2,70,106 మందికి పరీక్షలు చేశారు.37 మందికి నోటిక్యాన్సర్ నిర్ధారణ అయ్యింది..657 మందిని అనుమానితులుగా గుర్తించారు. 102 మందికి బ్రస్ట్ క్యాన్సర్ నిర్ధారణ కాగా 781 మందిని అనుమానితులుగా గుర్తించారు. 70 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కాగా 645 మందిని అనుమానితులుగా గుర్తించారు. ఇక 37,222 మందికి హైపర్ టెన్షన్(బీపీ) ఉన్నట్టుగా నిర్ధారించగా 20,105 మందిని అనుమానితులుగా, 30,113 మందికి షుగర్ ఉన్నట్టు నిర్ధారించగా మరో 27,950 మందిని అనుమానితులుగా గుర్తించారు. జిల్లాలో 27 శాతం మందికి బీపీ, 20 శాతం మందికి షుగర్ ఉన్నట్టు అంచనా వేశారు.జిల్లాలో ఇంకా 5 లక్షలకు పైగా కుటుంబాల్లోని సుమారు 12.5 లక్షల మందికి పరీక్షలు చేయవలసి ఉంది. ఆరోగ్య సర్వే త్వరగా చేయించడం వల్ల బాధితులెవరో తేలుతుంది. త్వరిత గతిన వైద్యం అందుతోంది.

### వివరాలన్నీ ఆన్‌లైన్..

ఎన్‌సీడీ-3.0 పేరిట సర్వే జరుగుతోంది.ప్రతి రోజూ జిల్లాలో కనీసం పది గృహాలకు వెళ్లి ఏఎన్ఎం, ఆశా వర్కరు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వమే ఇంటింటికీ ఒక బృందాన్ని పంపి పరీక్షలు చేయిస్తోంది.రొమ్ము క్యాన్సర్‌ను మహిళలే స్వయంగా గుర్తించేటట్టు అవగాహన కల్పిస్తున్నారు.నోటి క్యాన్సర్ ఎందుకు వస్తుందనే అంశంపై సర్వే చేస్తున్నారు.ఆయా వ్యక్తుల ఆహార అలవాట్లు, పొగ తాగడం, గుట్కాలు నమలడం వంటి వాటివల్ల ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. రోగి పేరు, వ్యాధి, వాడుతున్న మందులు, గతంలో వారి వైద్య చరిత్ర అన్నీ ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆ రోగి వేరే ప్రాంతానికి వెళ్లి ప్రభుత్వా సుపత్రుల్లో వైద్యం చేయించుకోవచ్చు. దానికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డును చూపిస్తే, దాని నెంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో వివరాలన్నీ సదరు డాక్టరు తెలుసుకుని సంబంధిత వైద్యం కొన సాగించే అవకాశం ఉంది. జిల్లాలో జూలై వరకూ సర్వే జరుగుతోంది. అన్ని గ్రామాలకు ఎఎన్ఎంలు,ఆశావర్కర్లు ఉన్నారు.అటు వంటప్పుడు కేవలం రోజుకు 10 కుటుంబాలకే పరిమితం ఎందుకు.ప్రతి మండలం యూనిట్‌గానో, గ్రామం యూనిట్‌గానో సర్వే చేస్తే సమస్యలు త్వరగా బయటకు వచ్చే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.



## అమ్మా..కోట సత్తెమ్మ

నిడదవోలు,జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు.ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహ స్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు.ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆదివారం ఒక్కరోజే రూ.2,00,565/-లు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్, చైర్మన్ రవి శంకర్ తెలిపారు.

## ప్రశాంతంగా రేషన్ డీలర్ల రాతపరీక్ష





రాజానగరం గైట్, కొవ్వూరు ఏబీఎన్ కళాశాలల్లో రేషన్ డీలర్ల రాత పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు, ఆర్‌డీవోలు కృష్ణనాయక్, రాణి సుస్మిత

- గైట్ కళాశాలలో రాజమండ్రి డివిజన్ పరీక్ష
- 145 షాపులకు నోటిఫికేషన్
- 450 మంది హాజరు
- ఏబీఎన్ కళాశాలలో కొవ్వూరు డివిజన్ పరీక్ష
- 64 షాపులకు నోటిఫికేషన్
- 124 మంది హాజరు
- 31న తుది ఫలితాలు వెల్లడి

రాజానగరం/కొవ్వూరు, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : రేషన్‌డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నిర్వహిస్తున్న రాత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. రాజమహేంద్రవరం డివిజన్‌కు సంబంధించి గైట్ ఇంజనీరింగ్ కళాశాల, కొవ్వూరు డివిజన్‌కు సంబంధించి ఏబీఎన్ & పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం డీలర్ల ఎంపికకు 80 మార్కులకు రాత పరీక్షలు నిర్వహించారు. ఫెయిర్ ప్రైస్ షాప్(ఎఫ్.పి షాప్స్) పేరిట పరీక్షలు నిర్వహించినట్టు ఆర్‌డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత తెలిపారు. గైట్ పరీక్షా కేంద్రాన్ని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్, రాజానగరం తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి ఆకస్మికంగా సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ, గోకవరం, రంగంపేట, అనపర్తి, బిక్కవోలు, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్, కడియం, పది మండలాలకు సంబంధించి 145 దుకాణాలకు 487 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరిలో 450 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్టు చెప్పారు. కొవ్వూరు ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్ పరిధిలో 9 మండలాల్లో ఖాళీగా ఉన్న 73 రేషన్‌డీలర్లకు గాను 64 షాపుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా 185 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిలో విద్యార్హతలు లోపించడం, నోటిఫికేషన్‌లో పొందుపర్చిన రోస్టర్‌లో దరఖాస్తు చేయకపోవడం, వయో పరిమితి 40 ఏళ్లు దాటిన అభ్యర్థులకు సంబంధించి 53 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందన్నారు. ఆదివారం 132 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 8 మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ నెల 21వ తేదీన పరీక్షా పత్రాల మూల్యాంకనం చేస్తామన్నారు. 28వ తేదీన 20 మార్కులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 31వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామన్నారు.ఆమె వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వై.రమేష్, సీఎస్ డీటీలు ఎం.సునీత, ఎ.సత్యనారాయణ, ఎం.అనిల్, టి.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



వేదికపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు

## సినీ పరిశ్రమకు ఆంధ్ర అనుకూలం

### కార్మిక శాఖ మంత్రి సుభాష్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సినీ కార్మికులకు న్యాయం చేయడానికి తగిన కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ సినీ వర్కర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరై మాట్లాడారు. సినీ పరిశ్రమకు ఎంతో అనువైన ఆంధ్రప్రదేశ్‌ను టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి మంత్రి కందుల దుర్గేష్ కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో షూటింగ్‌లు చేయడానికి నిర్మాతలు రావాలన్నారు.అవసరమైతే ప్రభుత్వ పరంగా సాయం అందజేస్తామన్నారు.ఇక్కడ షూటింగ్‌లు చేస్తే స్థానికులకు 80 శాతం అవకాశాలు ఇవ్వాలనే నిబంధన అమలవుతుందని,తద్వారా ఈ ప్రాంత కళాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ సినీ పరిశ్రమకు ఆంధ్ర అనువుగా ఉంటుందన్నారు.దర్శన నిర్మాతలు ఆంధ్ర వైపు చూడాలన్నారు.రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సినీ కళాకారుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. సీఎం చంద్రబాబుకు సినీ పరిశ్రమ అంటే ఎంతో అభిమానమని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సినీ పరిశ్రమకు చెందిన వారేనని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ నిలదొక్కుకొనే చర్యలు చేపట్టాలని కష్టపడి పనిచేస్తున్న స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలని పలువురు ప్రముఖులు కోరారు. ఈ కార్యక్రమంలో సినీ హీరో భానుచందర్, నటుడు పిల్లా లక్ష్మీ ప్రసాద్, సోము వీర్రాజు, ఆకుల వీర్రాజు, శ్రీనివాసనాయుడు, పంతం కొండలరావు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేశవరావు,మేడా శ్రీనివాస్, నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు పాల్గొన్నారు.

# సంచార రైతుబజార్లు ఏర్పాటు చేయాలి



- తాజా, నాణ్యమైన ఉత్పత్తులు
- రైతుల పంటలు విక్రయించుకునేందుకు అవకాశం

దివాన్‌చెరువు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం సంచార రైతుబజార్లు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ సంచార రైతు బజార్లు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చేరుకోగలవు. దీనివల్ల రైతులకు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వీలవుతుంది. అలాగే మంచి ధరను పొంది వారి ఆదాయాన్ని పెంచుకునేందుకు కూడా రైతులకు అవకాశం ఏర్పడుతుంది. అలాగే సంచార రైతుబజార్ల వల్ల సుదూర ప్రాంతంలోని మార్కెట్‌కు వారు వెళ్లవలసిన అవసరం ఉండదు కాబట్టి రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక వినియోగదారుల విషయానికి వస్తే సంచార రైతుబజార్ల వల్ల వినియోగదారులకు నేరుగా రైతుల నుంచి తాజా, అధిక నాణ్యత ఉత్పత్తులను అందుతాయని చెప్పవచ్చు. అలాగే సరసమైన ధరలకు కుడా ప్రజలకు కూరగాయలు అందుతాయి. బహుళ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మండలంలోని దివాన్‌చెరువు, పుణ్యక్షేత్రం, రాజానగరం, తదితర గ్రామాలలో కనీసం వారంలో మూడు రోజులు అయినా ఈసంచార రైతు బజార్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తగు కార్యాచరణ రూపొందించాలని పలువురు కోరుతున్నారు.

# వేమన పద్యాలు.. జీవిత సత్యాలు: జేసీ



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): యోగి వేమన రాసిన పద్యాలు మనిషి జీవితాలను మేలుకొలిపే సత్యాలని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. యోగివేమన జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం వేమన చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవిత సత్యాలను పద్య రూపంలో అందించిన మహోన్నతమైన వ్యక్తి యోగి వేమన అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, ఏవో ఎండీ ఆలీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి సాయం అందజేత



లబ్ధిదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదల ఆరోగ్యానికి ఆర్థిక సహకారం అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో వాడపల్లికి చెందిన బెజవాడ పోశమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన రూ.30,028 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, ఎం. సురేష్, ఎస్. సత్తిబాబు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

చాగల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 20 నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మండల పశువైద్య అధికారి యు.ముఖేష్ తెలిపారు. పశు వైద్యశాలలు లేని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి గర్భకోశ వ్యాధుల చికిత్సలు, నట్టల నివారణ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 20న నెలటూరు, 21న చంద్రవరం, గౌరిపల్లి, 22న నందిగంపాడు, 23న మార్కొండపాడు, 24న ఊనగట్ల, 25న ఎస్.ముప్పవరం, 27న బ్రాహ్మణగూడెం, 28న దారవరం, 29న మల్లవరం, 30న చిక్కాల గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ముఖేష్ పేర్కొన్నారు.

# జనసేన నాయకుల ఆత్మీయ కలయిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న గంటా కృష్ణ

తాళ్లపూడి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ మండల నాయకుల ఆత్మీయ కలయిక స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు అయితం మణికంఠ, వెంపా శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండలాధ్యక్షుడు గంటా శివరామకృష్ణ, జిల్లా కార్యదర్శి గాయిత్రీ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కృష్ణ మాట్లాడుతూ తాళ్లపూడిలో చదువుకుని అట్లాంటాలో ఉద్యోగం చేస్తూ జనసేన ఎన్ఆర్ఐ సభ్యుడిగా ఉన్న యడవల్లి మహరాణా సహకారంతో ముందుకు వెళుతున్నామన్నారు. నియోజకవర్గంలో 13 సొసైటీలు ఉన్నాయని వాటిలో కొన్నయినా జనసేన పార్టీకి కేటాయించే విధంగా చేయాలన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు పొందే విధంగా ప్రతి జనసైనికుడూ కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉప్పులూరి బాబ్జి, కొప్పాక విజయ్ కుమార్, కొక్కిరపాటి పృధ్వి, శీర్ల సూర్యచంద్ర, కళ్లేపల్లి ప్రభాత్ పాల్గొన్నారు.

# వీఆర్వోల సంఘం చాగల్లు అధ్యక్షుడిగా మొహిద్దీన్



చాగల్లు మండలం వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

చాగల్లు, జనవరి 19, (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) సంఘం మండలాధ్యక్షుడిగా మహమ్మద్ మునీర్ మొహిద్దీన్ ఎన్నికయ్యారు. వీఆర్వోల సంఘం ఎన్నికలు జిల్లా ఉపాధ్యక్షుడు మేడిది కమల సుందర్ పర్యవేక్షణలో జరిగాయి. ఉపాధ్యక్షురాలిగా వి.జ్యోతి, కార్యదర్శిగా టి.రవి, జాయింట్ కార్యదర్శిగా సుభాష్ చంద్రబోస్, కోశాధికారిగా జొన్నకూటి శేషు, జాయింట్ కోశాధికారిగా పద్మ సూర్యకుమారి, సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

# పాలనా సంస్కరణలతో ప్రభుత్వానికి సార్థకత



మార్కొండపాడులో మొక్క నాటుతున్న వెంకన్నచౌదరి

చాగల్లు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు పాలనా సంస్కరణలు అమలు చేసినప్పుడే మంచి ప్రభుత్వానికి సార్థకత వస్తుందని పారిశ్రామికవేత్త, సుంకవల్లి ఫౌండేషన్ ఛైర్మన్ సుంకవల్లి వెంకన్నచౌదరి అన్నారు. సంక్రాంతి సందర్భంగా మార్కొండపాడు స్వగ్రామం విచ్చేసిన ఆయన గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలని, పాలనలో వేగం పెరగాలన్నారు. రాజధాని నిర్మాణం పనులు, పోలవరం ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభం కావడం, రోడ్లు మెరుగుపడం రాష్ట్ర అభివృద్ధికి శుభసూచికలని అన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులకు సర్టిఫికెట్లు



రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా మరెన్నో సేవా కార్యక్రమాలను ప్రజలకు అందిస్తామని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి పేర్కొన్నారు.కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ డాక్టర్ దల్‌సింగ్, సొసైటీ సభ్యులు మహాలక్ష్మి,కేవీ.రమణ,బండి వెంకటేశ్వరరావు, ట్రైనర్ ధర్మారావు పాల్గొన్నారు.

## నేడు తాళ్లపూడిలో పీజీఆర్ఎస్

తాళ్లపూడి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు విచ్చేయనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారని, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

# పల్లె దారి మారింది!

- గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం
- గోపాలపురం నియోజకవర్గంలో రూ.8.46 కోట్లతో పనులకు శ్రీకారం
- గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ



గోపాలపురంలో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డు

గోపాలపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు పెడుతుంది. నాడు గుంతల రోడ్లపై కనీసం మట్టి వేసేవారు కాదు. గుంతల్లో ఏర్పడిన మురికి నీటిలోనే ప్రజలు నడిచే దుస్థితి. నేడు కూటమి రాకతో గడిచిన ఆరునెలల్లో గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు నిర్వహించగా, గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించి సంక్రాంతి పండుగ సందర్భంగా పల్లెలకు వచ్చే బంధుమిత్రులకు సుఖవంతమైన ప్రయాణం కల్పించాలన్న సీఎం చంద్రబాబు సంకల్పాన్ని స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నూరుశాతం అమలు చేసి చూపించారు. దీంతో పల్లెలు సీసీ రోడ్లతో ఆహ్లాదకరంగా మారాయి. గోపాలపురం మండలంలో మొదటి విడతగా 13 పనులకు రూ.1.43 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. దీంతో సంక్రాంతి పండుగ నాటికి 11పనులు పూర్తికాగా 2చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. దేవరపల్లి మండలంలో 18పనులకు గానూ రూ.2.36 కోట్లు మంజూరయ్యాయి. 15పనులు పూర్తయ్యాయి. మూడు పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. అలాగే నల్లజర్ల మండలంలో 38 పనులకు గానూ రూ.4.67 కోట్లు మంజూరయ్యాయి. 25 పనులు పూర్తికాగా మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. 2వ విడత సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి మూడు మండలాల పరిధిలో రూ.1.03 కోట్లు మంజూరయ్యాయి. కూటమి రాకతో గుంతల రోడ్లపై సీసీ రోడ్లు నిర్మించడంతో పల్లెలకు మహర్దశపట్టినట్టు అయ్యింది.

### మరింత అభివృద్ధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులు ప్రస్తుత ప్రభుత్వానికి కలిసొచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు వినియోగించుకోవడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైంది. రానున్న కాలంలో మరింత అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నా.

-దాసరి రవి, ఎస్సీ సెల్ కార్యదర్శి, పెద్దగూడెం.

### నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం

మండలంలో ఉపాధి హామీ నిధులతో రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలతో కూడిన రహదారుల నిర్మించాం. ఎక్కడా రాజీపడకుండా ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనులు పూర్తి చేశాం. రహదారి నిర్మాణాలు జరిగిన ప్రతీచోట పర్యవేక్షించాం.

-జి.పవన్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ, గోపాలపురం.

## ముగిసిన ముత్యాలమ్మ జాతర



ఉండ్రాజవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.సావరంలో గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర ముగింపు సందర్భంగా అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## 100వ పుట్టినరోజు వేడుక

తాళ్లపూడి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడిలో పేరుమోసిన కుటుంబాల్లో గోకవరపు వంశీయులు ఒకరు. ఈ వంశంలోని గోకవరపు విశ్వేశ్వరరావు 1925 జనవరి 19న పుట్టారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆయన పుట్టి 100 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆయన భార్య, కొడుకులు, కూతుళ్లు, మనవలు, ముని మనవలు వేద పండితుల సమక్షంలో పాద పూజ చేశారు.

## లిఫ్ట్ ఇస్తానని బంగారం దోచుకెళ్లాడు

### వృద్ధురాలి మెడలో ఆభరణాల చోరీ

అనపర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బస్సు దిగి నడిచి వెడుతున్న వృద్ధ దంపతులను లిఫ్ట్ ఇస్తానని నమ్మించి వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని దుండగుడు దొంగిలించిన సంఘటన అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం కొప్పవరం రోడ్డులో శనివారం జరిగింది. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం. అనపర్తి మండలం కొప్పవరానికి చెందిన వృద్ధ దంపతులు సబ్బెళ్ల వెంకటరెడ్డి, వెంకయ్యమ్మ కాకినాడలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో లక్ష్మీనరసాపురం వంతెన వద్ద బస్సు దిగి కొప్పవరానికి నడిచి పయనమయ్యారు. కొంత దూరం వెళ్లిన తర్వాత మోటారుసైకిల్‌పై వచ్చిన దుండగుడు వృద్ధురాలికి లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఆమెను కొంతదూరం తీసుకువెళ్లాడు. అక్కడ నిర్మానుష్య ప్రదేశంలో బండి ఆపి ఆమె మెడలో మంగళ సూత్రాలతో ఉన్న రెండు పేటల బంగారు గొలుసు, నల్లపూసల దండతో సహా 8 తులాల బంగారంతో ఉడాయించాడు. వెంకటరెడ్డి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## ప్రయాణికుల రద్దీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో రైళ్లు ప్రయాణికులతో రద్దీగా వెళ్తున్నాయి. సంక్రాంతి పండగను ముగించుకున్న జిల్లా ప్రజలు తిరుగు ప్రయాణంలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం నుంచి రాజమహేంద్రవరం చేరుకుని ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రైళ్ల కోసం వేచి చూశారు.

# కూలిపై కుదరని సయోధ్య

- తీపర్రు, పెండ్యాల, పందలపర్రు ఇసుక ర్యాంపుల్లో నిలిచిపోయిన తవ్వకాలు
- రూ.300 ఇవ్వాలని బంటా కార్మికుల డిమాండ్
- ఇవ్వలేమంటున్న నిర్వాహకులు



ఎగుమతులు లేక పోవడంతో ఖాళీగా ఉన్న తీపర్రు ర్యాంపు

పెరవలి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా తీపర్రు ఇసుక ర్యాంపుతో పాటు పెండ్యాల, పందలపర్రు ర్యాంపుల్లో కూడా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. దీంతో ఇసుక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల పాటు పండుగ సెలవులు కావడంతో బంటా కార్మికులు ఇసుక తవ్వకాలకు వెళ్లలేదు. అనంతరం ఇసుక తవ్వేందుకు ఇచ్చే కూలి విషయమై బంటా కార్మికులకు, ర్యాంప్ నిర్వాహకులకు మధ్య తేడాలు రావడంతో తవ్వకాలకు రావడం లేదని చెబుతున్నారు. గతంలో ఒప్పందం ప్రకారం ట్రాక్టర్ ఇసుక లోడు చేసేందుకు రూ.250 జట్టు కార్మికులు తీసుకునేవారు అయితే ఒక్కొక్క ట్రాక్టర్ ఎగుమతి చేయడానికి తమకు రూ.300 ఇవ్వాలని బంటా కార్మికులు డిమాండ్ చేశారు. అయితే ఇప్పటికే తమకు గిట్టుబాటు కావడం లేదని, ఐదు యూనిట్ల లారీ ఎగుమతి చేయడానికి సుమారు 7నుంచి 8 ట్రాక్టర్ల ఇసుక అవసరం అవుతుందని వాస్తవానికి ఐదు ట్రాక్టర్ ఇసుకతోనే ఐదు యూనిట్ల లారీ నిండాలని అందువల్ల అధిక సొమ్ము ఇవ్వలేమని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారమే ఒక్కొక్క కార్మికుడికి 800నుంచి 1000 పైగా కూలి గిడుతుందని ఇంకా రేటు పెంచాలనడం సరికాదంటున్నారు. ఈ నేపథ్యంలో ర్యాంపుల్లో ఇసుక లభ్యం కాక అటు లారీ యజమానులతోపాటు ఇసుక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంటా కార్మికులు ర్యాంపు నిర్వాహకుల మధ్య ఒప్పందం ఎప్పుడు కుదురుతుందో, ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని పలువురు ఎదురు చూస్తున్నారు.

# 'అమిత్‌షా గో బ్యాక్'

దేవరపల్లిలో వామపక్షాల నిరసన



దేవరపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు

దేవరపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తప్పించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటన నిరసిస్తూ 'అమిత్‌షా గో బ్యాక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రత్నాజీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకుడు సీహెచ్ రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా వచ్చిన పదవులు అనుభవిస్తూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగానే అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. రాజ్యాంగం పట్ల అమిత్‌షాకు ఏ మాత్రం గౌరవం ఉన్నా వెంటనే హోం మంత్రి పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకుని అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ఆచంట సత్యనారాయణ, ఏఎఫ్‌టీయూ నాయకుడు పెంటయ్య, సీపీఎం నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని సత్యనారాయణ, ఆచంట సుభాష్‌చంద్రబోస్, మేడా వెంకటేష్, న్యూడెమొక్రసీ నాయకుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలి

- మాతా విద్యానందగిరి
- దేవరపల్లిలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహోత్సవాలు



మహోత్సవాలకు విచ్చేసిన సాధువులు

దేవరపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక, ధార్మిక చైతన్యం, సామాజిక స్పృహ, దేశభక్తి కలిగి ఉండి ప్రశాంతమైన వాతావరణంలో ఆరోగ్యమైన జీవితాన్ని గడపాలని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాత విద్యానందగిరి అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్ హాలులో అఖిలాంధ్ర సాధు పరిషత్ 60వ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాలకు సుమారు 400మంది సాధువులు విచ్చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు భగవద్గీత పారాయణం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సాధు పుంగవులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన వారు అన్నమాచార్య కీర్తనలు గానం చేశారు. దేవరపల్లి ఆది శంకరాచార్య ధ్యానమందిరం మహిళా కమిటీ సభ్యులు సౌందర్య లహరి పారాయణ చేశారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు గద్దే మునేశ్వరరావు, బళ్లా సూర్యచక్రం, బలుసు సత్యనారాయణ, యాగంటి వెంకటేశ్వరరావు, సుంకవల్లి రామారావు, గన్నమని హరికృష్ణ, కరుటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సాధువులు

# బర్రే కొండబాబు గృహనిర్బంధం



గృహనిర్బంధంలో ఉన్న బర్రే కొండబాబు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థాయి సంఘం మాజీ ఛైర్మన్ బర్రే కొండబాబును ఆదివారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. క్వారీ గోతులను ఈ నెల 18వ తేదీలోగా పూడ్చకపోతే దీక్ష చేస్తానని ముందస్తుగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం దీక్షకు సిద్ధమై జాతీయ జెండాతో బయటకు వచ్చిన కొండబాబును అడ్డగించి గృహనిర్బంధం చేశారు. దీంతో పోలీసులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఉదయం నుంచి పోలీసులు క్వారీ ప్రాంతం సుబ్బారావు నగర్‌లోని బర్రే నివాసం వద్ద మోహరించారు. కొండబాబు మాట్లాడుతూ 2011 నుంచి క్వారీ గోతులను పూడ్చాలని ఉద్యమం చేస్తున్నానన్నారు. తనను గృహ నిర్బంధం చేసినా ఉద్యమం ఆగదన్నారు. సమస్య పరిష్కరించకపోతే హైవేను నిర్బంధించి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# సప్లై కంపెనీ సంఘ వనసమారాధన

రాజమహేంద్రవరం కల్చరల్ జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి మైక్ అండ్ లైటింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వనసమారాధన నిర్వహించారు. నగరంలోని పాత బొమ్మూరు రామకృష్ణ తోటలో జరిగిన వన సమారాధనలో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుల్లివల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పొట్లూరి వసంతకుమార్, కోశాధికారి బెవర రామారావు, కొల్లి గణేష్ తదితరులు పర్యవేక్షించారు.

# జీమా కార్యవర్గ ప్రమాణ స్వీకారం



జిత్ మోహన్‌మిత్రను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (జీమా) 7వ వార్షికోత్సవం గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్‌మిత్ర కళావేదికపై ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా సంఘ అధ్యక్షుడు డీఎస్ఎస్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎంఎస్.చక్రధర్, కేవీవీఎస్ అవధాని, కార్యదర్శి డి.సురేంద్ర, కోశాధికారి పిచ్చుక మహేష్, జాయింట్ సెక్రటరీ ఎం.సాయిరాం ప్రమాణ స్వీకారం చేశారు.జిత్ మోహన్ మిత్రను నటగాయక బిరుదుతో జీమా సభ్యులు సత్కరించారు. ఈ కార్య క్రమంలో సినీ హాస్యనటుడు గౌతంరాజు,దర్శకుడు ఆనంద సాగర్, ఎస్.ఎస్.స్వామి,బాబీ, జీమా ఫౌండర్ కె.మహేష్ పాల్గొన్నారు.

# సనాతన ధర్మవ్యాప్తికి గాడ్ కృషి అభినందనీయం

### ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు

రాయవరం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మవ్యాప్తికి వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్ చేస్తున్న కృషి అభినందనీయమని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు అన్నారు. గాడ్ 89వ జన్మదిన వేడుకలు పీఠం వద్ద ఉన్న సీతాసదనంలో ఆదివారం నిర్వహించారు. యర్రాప్రగడ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పీఠాధిపతులు, మఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు కృషి చేయడం సంతోషకరమని, హిందూ ధర్మవ్యాప్తికి మరింత కృషిచేయాలన్నారు. గాడ్ ఆధ్యాత్మిక సేవల ద్వారా తాను పుట్టిన ప్రాంతానికే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరు పొందారన్నారు.